సాక్షి
కుమురం భీం

శుక్రవారం, 27, అక్టోబర్, 2023



తిరుగు ప్రయాణ పాట్లు..!
పండుగ సెలవులు ముగియడంతో ప్రయాణికులు తిరుగు ప్రయాణం అవుతున్నారు. రద్దీని గుర్తించిన ఆర్టీసీ యాజమాన్యం అదనపు బస్సులు నడపాల్సి వచ్చింది. 10లో▸



ముమ్మరంగా తనిఖీలు
పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. 24గంటలపాటు చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటున్నారు. పరిమితికి మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తున్నారు. 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /18.2

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు చంద్రగ్రహణం

ఆసిఫాబాద్: శనివారం అర్ధరాత్రి పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడుతుందని దూపదీప నైవేద్యం అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిరీశ్ శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి 1.08 గంటల వరకు మోక్షకాలం ఉంటుందన్నారు. రాత్రి 2.37 గంటల వరకు గ్రహణం ఉంటుందని తెలిపారు. గ్రహణం నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆలయాలు మూసివేస్తామని, తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుచుకుంటాయని వారు పేర్కొన్నారు.

11లోగా ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులు నవంబర్ 11లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఐఈవో శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ విద్యార్థులు రూ.510, ఒకేషనల్ విద్యార్థులు రూ.730 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆలస్య రుసుం రూ.100తో నవంబర్ 23 వరకు, రూ.500తో డిసెంబర్ 4, రూ.1000తో డిసెంబర్ 13, రూ.2000 అపరాధ రుసుంతో డిసెంబర్ 20 వరకు ఫీజు చెల్లించుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఏఆర్ ఎస్సై కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ ఫిబ్రవరిలో గుండెపోటుతో మృతి చెందిన ఎం.సురేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు గురువారం ఎస్పీ సురేశ్‌కుమార్ పోలీసు శాఖ నుంచి బెనిఫిట్స్ నగదు అందజేశారు. ఏఆర్ ఎస్సై సతీమణి ఇందిరకు భద్రత ఫండ్ కింద రూ.7,98,000 విలువైన చెక్ అందించారు. అలాగే వారి కుటుంబానికి పోలీసుశాఖ నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీపీవో ఏవో శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.విజయ్ శంకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు స్వామి పాల్గొన్నారు.

ఘనంగా వెడ్మ రాము వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సక్కు

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలోని ఏదులపహాడ్‌లో గురువారం వెడ్మ రాము వర్ధంతి నిర్వహించారు. ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు వేర్వేరుగా హాజరై వెడ్మ రాము విగ్రహానికి నివాళులర్పించారు. సంప్రదాయబద్ధంగా పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. పీవో మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన తర్వాత పీవీటీజీ నిధుల ద్వారా ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వెడ్మ రాము కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల సాధనకు వెడ్మ రాము చేసిన పోరాటం మరువలేనిదన్నారు. తోటి సంఘం నాయకులు పలు సమస్యలపై వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో డీటీడీవో రమాదేవి, పీవీటీజీ ఏపీవో భాస్కర్, ఏటీడీవో క్షేత్రయ్య, తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, సర్పంచ్ గోపాల్, జిల్లా సార్ మెడి మోతీరాం, సభ్యులు దస్రు, తిరుపతి, శంకర్, బొజ్జిరావు, మోతీరాం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల(సిర్పూర్): రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని తాటినగర్ గ్రామానికి చెందిన పలువురు గురువారం బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కోనప్ప నివాసంలో వారికి కోనప్ప కండువాలు కప్పి ఆహ్వానించారు.

పోరు పల్లెల గోస పట్టదా?

- గిరిజన వీరుడికి దన్నుగా నిలిచిన 12 ఊళ్లు
- నేటికీ ఆ గ్రామాలను వెంటాడుతున్న సమస్యలు
- మౌలిక వసతులకు నోచుకోని వైనం..
- ఆదివాసీలకు అందని ఐటీడీఏ రుణాలు
- ఈ నెల 28న కుమురంభీం వర్ధంతి



లైన్‌పటార్ గ్రామంలోని చేతిపంపు వద్ద గుమిగూడిన మహిళలు

కెరమెరి(ఆసిఫాబాద్): జల్.. జంగల్.. జమీన్ నినాదంతో నిజాం రాజుపై ఉద్యమించిన గిరిజన వీరుడు కుమురంభీంకు అండగా నిలిచిన పోరు గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఏళ్లు గడిచినా ప్రజల స్థితిగతుల్లో మార్పు రాలేదు. నిజాంకు వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న కెరమెరి మండలం జోడేఘాట్‌తోపాటు 12 పరిసర గ్రామాలను పోరు పల్లెలుగా పిలుస్తారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ ప్రాంతంలో ప్రకృతి రమణీయత ఆకట్టుకుంటుంది. ఆదివాసీ హక్కులు, అభివృద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన భీం ఆశయాలు నేటికీ నెరవేరలేదు. సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

బోరుమంటున్న పోరు పల్లెలు..

కెరమెరి మండలంలో జోడేఘాట్, జోడేఘాట్ కొలాంగూడ, టోకెన్‌మోవాడ్, బాబేఝరి కొలాంగూడ, బాబేఝరి గోండ్‌గూడ, బాబేఝరి మహరాజ్ గూడ, శివగూడ, చిన్నపట్నాపూర్, పెద్దపట్నాపూర్, పాటగూడ, లైన్‌పటార్, పిట్టగూడ గ్రామాలను పోరు గ్రామాలుగా వ్యవహరిస్తారు. ఆయా గ్రామాల్లో 322 కుటుంబాలు, 1,664 మంది జీవనం సాగిస్తున్నారు. చేతి పంపులు 18, ఆశ్రమ పాఠశాలలు 2, అంగన్‌వాడీ కేంద్రాలు 3, పాట్నాపూర్ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరందుతున్నా చాలా ప్రాంతాల్లో బావులు, చెలిమెల నీరే తాగుతున్నారు. ఈ నెల 28న కుమురంభీం వర్ధంతి సందర్భంగా గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక కథనం.

గ్రామాల వారీగా పరిస్థితి..

జోడేఘాట్ పంచాయతీలో 5 గ్రామాలు ఉండగా, 120 మందిలో 62 మందికి రైతుబంధు వస్తుంది. 10 మంది వివరాలు ఆన్‌లైన్ కాలేదు. అలాగే బాబేఝరి జీపీలో 9 గ్రామాల్లో 126 మందికి పోడుపట్టాలు ఇచ్చారు. 117 మంది రైతులకు రైతుబంధు అందుతోంది.

- జోడేఘాట్‌లో 40 గృహాలు ఉండగా 270 మంది నివాసం ఉంటున్నారు. నాలుగు చేతిపంపుల్లో ఒకటే పనిచేస్తోంది. ఇక్కడ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల ఉంది. నాలుగేళ్ల క్రితం ఐటీడీఏ అధికారులు సోలార్ బిగించినా నిరుపయోగంగా మారింది. 30 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా ఐదు మాత్రమే పూర్తయ్యాయి.
- జోడేఘాట్ కొలాంగూడలో 25 కుటుంబాల్లో 210 మంది ఉన్నారు. చేతిపంపు ఉన్నా పనిచేయడం లేదు. విద్యుత్ మోటార్‌పైనే ఆధారపడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా ఉంది. స్థానికంగా పాఠశాల లేక విద్యార్థులు జోడేఘాట్‌కు వెళ్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం లేదు. ఐటీడీఏ నుంచి రుణాలు అందడం లేదు.
- టోకెన్‌మోవాడ్‌లో 20 కుటుంబాల్లో 110 మంది ఉన్నారు. పట్టా పాసు పుస్తకాలు లేక బ్యాంకు రుణాలు అందడం లేదు. డబుల్ బెడ్రూం ఇళ్లు లేక చాలా మంది గిరిజనులు గుడిసెల్లోనే కాలం వెల్లదీస్తున్నారు.
- బాబేఝరి కొలాంగూడలో 23 కుటుంబాలు, 170 మంది ఉన్నారు. ఇక్కడ చేతి పంపులు లేవు. మిషన్ భగీరథ నీరు నిలిచిపోతే కిలోమీటరు దూరంలోని బావి వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. ఎద్దుల జతలు అందించాలని గ్రామస్తులు ఐటీడీఏ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇతర గ్రామాల రైతుల నుంచి తాత్కాలికంగా ఎద్దులు తెచ్చుకుని సాగు పనులు చేసుకుంటున్నారు.
- బాబేఝరి గోండ్‌గూడలో 23 కుటుంబాలు, 132 మంది ఉన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ఉంది. మూడు చేతి పంపులు వేసవిలో ఇంకిపోతున్నాయి. ఎండాకాలంలో వీరికి గ్రామ సమీపంలోని చెలిమె నీరే దిక్కవుతుంది. పది మందికి ఇళ్లులేవు. భారీ వర్షాల సమయంలో ఇళ్లలోకి వరద చేరుతుంది.
- బాబేఝరి మహరాజ్‌గూడలో కుటుంబాలు 35, జనాభా 173 ఉంది. కొందరికి రేషన్ బియ్యం అందడం లేదు. మిషన్ భగీరథ నీరు వస్తున్నా చేతిపంపు పనిచేయడం లేదు. చాలా మంది ఇప్పటికీ కిలో మీటరు దూరంలోని బావి నీటినే తాగుతున్నారు.
- శివగూడలో 16 కుటుంబాలు, జనాభా 70 ఉంది. చేతిపంపు ఉన్నా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం లేదు. విద్యార్థులు సమీపంలోని బాబేఝరికి వెళ్తున్నారు. భగీరథ నీరు శుభ్రంగా లేకపోవడంతో చెలిమె నీటిని తాగుతున్నామని స్థానికులు తెలిపారు. ఐటీడీఏ అధికారులు ఇక్కడ 13 మోడల్ గృహాలు నిర్మించారు. గ్రామంలో మరో ముగ్గురికి ఇళ్లు అందాల్సి ఉంది.
- చిన్నపట్నాపూర్‌లో 48 కుటుంబాలు, జనాభా 228 ఉంది. విద్యార్థుల్లో కొందరు హట్టి ఆశ్రమ పాఠశాలలకు వెళ్తున్నారు. సాగు నీటి కోసం ఇంజిన్లు ఇవ్వాలని, డ్రెయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.
- పెద్దపట్నాపూర్‌లో 27 కుటుంబాలు, 183 మంది ఉన్నారు. పెంకుటిళ్లలో కాలం వెల్లదీస్తున్నారు. స్కూలు, అంగన్‌వాడీ కేంద్రం లేదు.
- పాటగూడలో 43 కుటుంబాలు, జనాభా 220 ఉంది. ఇది అంతర్జాతీయంగా పేరుగాంచిన గ్రామం. కానుగ నూనెతో విద్యుత్ తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రభుత్వ గృహాలు మంజూరు కాలేదు. 20 మంది విద్యార్థులున్నా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం లేదు.
- లైన్‌పటార్‌లో 11 కుటుంబాలు, 48 మంది జనాభా ఉంది. ఇక్కడ పాఠశాల లేదు. చేతిపంపు ఎండాకాలంలో ఇంకిపోతే రెండు కిలోమీటర్లు నడవాల్సిందే. టోకెన్‌మోవాడ్ నుంచి రోడ్డు సౌకర్యం లేదు.
- పిట్టగూడలో 11 కుటుంబాలు 50 మంది ఉన్నారు. పాఠశాల భవనం ఉన్నా ఉపాధ్యాయుడు లేరు. విద్యార్థులు సమీపంలోని బడులకు వెళ్తున్నారు.



ఆదివాసీలు తాగునీటికి వినియోగించుకునే చెలిమె



పాటగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

ఇల్లు ఇవ్వాలి



50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. గ్రామంలో ఒక్కరికీ కూడా పక్కా ఇల్లు లేదు. పూరి గుడిసెల్లోనే ఉంటున్నాం. ఇప్పటికైనా ఇల్లు ఇవ్వాలి.
– ఆత్రం పాపుగా, పాటగూడ

బీటీ రోడ్డు నిర్మించాలి



టోకెన్ మోవాడ్ నుంచి లైన్‌పటార్ వరకు బీటీరోడ్డు నిర్మించాలి. అటవీ అధికారులు అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణానికి తక్షణమే అనుమతులివ్వాలి. ఇందుకు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.
– ఆత్రం భీంరావు, లైన్‌పటార్

రేషన్ అందడంలేదు



నాకు భూమికి ఎలాంటి పట్టా లేదు. ఇల్లు కూలేందుకు సిద్ధంగా ఉంది. రేషన్ కూడా అందడం లేదు. ఏడుగురిని పోషించాలంటే కష్టంగా ఉంది. గతంలో సర్వే చేసినా పట్టా రాలేదు.
– నాగుబాయి, బాబేఝరి(కొలాంగూడ)

బిల్లులు ఇవ్వాలి



డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైతే ఇచ్చిన బిల్లుతో స్లాబ్ లెవల్ వరకు పూర్తి చేశా. స్లాబ్ వేసేందుకు డబ్బులు లేవు. అధికారులు వెంటనే బిల్లులు ఇవ్వాలి.
– పెందోర్ రాజేశ్వర్, జోడేఘాట్

భీం వర్ధంతికి ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

కెరమెరి(ఆసిఫాబాద్): జోడేఘాట్‌లో నిర్వహించే కుమురంభీం 83వ వర్ధంతి కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. కెరమెరి మండలం హట్టి ఆశ్రమ పాఠశాలలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 95 మందితో కూడిన ఏడు ఆదివాసీ కళాకారుల బృందాలు వస్తాయని ఏపీవో భాస్కర్ తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే వారి కోసం 60 వేల వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. విద్యుత్ సమస్య లేకుండా చూడాలని పీవో సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ 30 మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. ట్రాక్టర్లు, తాగునీటి ట్యాంకులను అందుబాటులో ఉంచాలని సూచించారు. హట్టితోపాటు జోడేఘాట్‌లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో మాదిరి కాకుండా సమీపంలోనే పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. సుమారు 20 వేల మంది వచ్చే అవకాశం ఉండటంతో భోజనం, తాగునీటికి ఇబ్బందులు ఎదురుకావొద్దని పేర్కొన్నారు. హట్టి నుంచి జోడేఘాట్‌కు ఐదు బస్సులు నడపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రత్యేక నిధులు కేటాయించాలని నాయక్‌పోడ్ సంఘం నాయకులు కోరగా.. అందరూ ఒకటేనని ఉత్సవాన్ని విడదీయొద్దని కోరారు. కార్యక్రమంలో డీపీవో ఒమర్ హుస్సేన్, ఎంపీడీవో మహేందర్, ఏపీవో భాస్కర్, ఏటీడీవో పురుషోత్తం, విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, ఎస్సై గుంపుల విజయ్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆత్రం బొజ్జిరావు, సభ్యులు మడావి రఘునాథ్, దుందేరావు, సోము తదితరులు పాల్గొన్నారు.

‘సిర్పూర్ ప్రజలే నిర్ణయిస్తారు’

కాగజ్‌నగర్‌టౌన్: పుట్టింది అలంపూర్‌లో అయినా తాను మరణించేది మాత్రం సిర్పూర్ గడ్డ మీదనేనని, ఎన్నికల తర్వాత ఎవరు లోకల్, ఎవరు గ్లోబల్ అనేది ఇక్కడి ప్రజలే నిర్ణయిస్తారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంతోపాటు పలు ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో ఆయన పాల్గొన్నారు. పలువురు బీఎస్పీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేను ప్రశ్నించే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆరోపించారు. 26 ఏళ్ల పోలీస్ సర్వీస్‌లో ఏనాడూ అమాయకులపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయలేదని స్పష్టం చేశారు. బీఎస్పీ అధికారంలోకి రాగానే పోడు, అసైన్డ్ భూములకు పట్టాలు అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం రాస్పెల్లి, బారెగూడెం, అంశాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి గణపతి, నాయకులు తిరుపతి, నవీన్, గణేష్, రాంప్రసాద్, డోకే రాజన్న తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కార్యకర్తకు షేక్‌హ్యాండ్ ఇస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కొలాం వీరుడు.. కుంరం సూరు

- నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు
- కుమురంభీంకు అండగా ఉద్యమాలు
- జోడేఘాట్‌లో రేపు 26వ వర్ధంతి



కుంరం సూరు విగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న సూరు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించి పోరుబాట పట్టించిన ఖ్యాతి కొలాం వీరుడు కుంరం సూరుకు దక్కుతుంది. గోండు బెబ్బులి కుమురంభీంకు అండగా నిలిచి ఆయన ప్రజానీకాన్ని ఏకం చేశారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లో శనివారం సూరు 26 వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నారు.

1918లో జననం

కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామానికి చెందిన కుంరం చిన్ను, మారుబాయి దంపతులకు 1918లో సూరు జన్మించారు. గోండులు, కొలాం జాతి ప్రజల వెనుకబాటుతనానికి నిజాం ప్రభుత్వ విధానాలే కారణమని నమ్మిన సూరు.. తాబేదారులు, రజాకారుల అక్రమాలకు వ్యతిరేకంగా ఎదురుతిరిగారు. అదే సమయంలో జోడేఘాట్ ఆదివాసీ పోరాట యోధుడు కుమురంభీం రావడం ఆయనలో నూతనోత్తేజం నింపింది. గోండులు, కొలాం ప్రజలను ఏకం చేసి భీం పోరాటానికి అండగా నిలిచారు. ఆలా జోడేఘాట్ పరిసర ప్రాంతాల్లో 12 పోరు గ్రామాలు ఏకమయ్యాయి.

భూమి కోసం పోరుబాట

12 పోరు గ్రామాలను ఆనుకుని ఆదివాసీలు సాగు చేస్తున్న 100 ఎకరాల సాగు భూమిని రజాకారులు ఆక్రమించేందుకు యత్నించారు. అప్పటి కలెక్టర్ నిజాం సాహెబ్‌కు స్థానికులు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. కుమురంభీం నాయకత్వంలో సూరు, ఆదివాసీలు కలిసి జల్, జంగల్, జమీన్ నినాదంతో ఉద్యమాన్ని లేవనెత్తారు. 1938– 40 సంవత్సరాల్లో ఆసిఫాబాద్ తహసీల్దార్ ఆధ్వర్యంలో భీం ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిజాం మిలటరీ భీం జాడ కోసం సూరును చిత్రహింసలకు గురిచేశారు. అనంతర కాలంలో మడావి కొద్దు ఆచూకీ తెలపడంతో కుమురంభీంను కాల్చిచంపారు. ఆ పోరాటంలో సూరు కుడి చేయి, కాలును పోగొట్టుకున్నారు. ప్రాణాలను కాపాడుకునేందుకు సమతుల గుండంలో ఆరు నెలలో అజ్ఞాతంలో గడిపారు.

ఆశ్రమ పాఠశాలల ఏర్పాటుకు కృషి

1975లో ఐటీడీఏ ఏర్పడిన తర్వాత కుమురంభీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు సూరు కృషి చేశారు. అలాగే 1980లో కొలాం గ్రామాల్లో ఆశ్రమ పాఠశాలల ఏర్పాటులోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. 1986లో ఐటీడీఏలో కొలాం అభివృద్ధి అధికారిగా సూరు నియమితులయ్యారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ‘ఆదివాసీ కొలాం క్రాంతివీర్’ అనే బిరుదుతో గౌరవించింది. ఆసిఫాబాద్ మండలం శాకస్‌గొంది గ్రామంలో 1997 ఆగస్టు 10న కుంరం సూరు మృతి చెందారు. గతేడాది జోడేఘాట్‌లో సూరు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రేపు జోడేఘాట్‌లో నిర్వహించే ఆయన వర్ధంతి కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి ఆదివాసీలు హాజరుకానున్నారు.

నేడు జోడేఘాట్‌లో అవ్వల్‌పేన్ పూజ

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఐటీడీఏ అధికారులు
- తరలివెళ్లిన భీం వారసులు



గర్భగుడిలోని ప్రతిమలు

కెరమెరి(ఆసిఫాబాద్): భూమి కోసం, భుక్తి కోసం, జాతి విముక్తి కోసం నైజాం ప్రభుత్వంతో సాగిన పోరాటంలో కుమురంభీం ప్రాణాలు అర్పించాడు. నైజాం మిలటరీని గడగడలాడించడంలో భీంకు అండగా నిలిచిన పోచమ్మతల్లికి నేడు భీం వారసులు గిరిజన సంస్కృతి, సంప్రదాయం, ఆచార వ్యవహారాలతో అవ్వల్‌పేన్ (పోచమ్మ)పూజ నిర్వహించనున్నారు. ఏటా భీం వర్ధంతికి ఒకరోజు ముందు ఈ పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

తేనెటీగలు అస్త్రాలుగా..

గోండు వీరుడైన కుమురంభీం ఎన్నోఏళ్లుగా నిరాటంకంగా పోరాటం సాగించడానికి పోచమ్మతల్లి మంత్రదండమే కారణమని స్థానికులు నమ్ముతారు. వేలసంఖ్యలో పోలీసులు కుమురంభీంపై కాల్పులు జరిపినా తూటాలు మాత్రం ఆయనకు తాకేవి కావు. పోలీసులు దగ్గరికి రాగానే మంత్రదండం శక్తితో తేనెటీగలు తయారు చేసి వాటిని అస్త్రాలుగా ఉపయోగించి పోలీసులపై వదిలేవాడు. ఆముదం విత్తనాలను మంత్రశక్తి ద్వారా ఉపయోగించి తనకు తాను రక్షించుకునే వాడు. ఇన్ని విధాలుగా ఆ మంత్ర దండం శక్తి భీంకు ఉపకరించడంతో ఆయన వంశస్తులు పోచమ్మతల్లికి ఘనంగా పూజలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా జోడేఘాట్‌లోని భీం సమాధికి నివాళులర్పించి జెండాలను ఎగురవేస్తారు. పోచమ్మతల్లికి గొర్రెను బలిచ్చి మొక్కు తీర్చుకుంటారు. ఆయా కార్యక్రమాలకు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భీం వారసులతో పాటు, ఆరాధికులు అధికసంఖ్యలో తరలిరానున్నారు. భీం మనుమడు కుమురం సోనేరావుతో పాటు వంశస్తులు, ఇతర పెద్దలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తి అరెస్ట్

జన్నారం(ఖానాపూర్): అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌ను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా హైదరాబాద్‌లో కారును గుర్తించిన పోలీసులు సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 23 న జన్నారం మండలం పొనకల్‌కు చెందిన పిప్పర్ల రాహిత్య, తరాల్ల సాత్విక, పిప్పర్ల గంగన్న బైక్‌పై వస్తుండగా చెక్కపెల్లి కుంట వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఘటనలో రాహిత్య, సాత్విక మృతి చెందగా గంగన్నకు తీవ్రగాయాలయ్యాయి.

ప్రమాదం జరిగింది ఇలా..

మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్‌కు చెందిన బుద్దె మల్లేశ్, అతని కుమారుడు బుద్దె దిలీప్ ఈ నెల 23న తన అత్తగారి ఊరైన దేవునిగూడకు వచ్చాడు. దిలీప్ మధ్యాహ్నం నస్పూర్ వెళ్లి సాయంత్రం దేవునిగూడకు వచ్చేక్రమంలో బైక్‌ను ఢీ కొట్టాడు. గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్‌కు పరారయ్యాడు. ప్రమాదానికి ముందు నిందితుడు జన్నారం నుంచి రేండ్లగూడ వైపు వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. వీటి ఆధారంగా పోలీసులు 24 గంటల్లో కేసును ఛేదించారు.

ఇరువురిపై కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సోదరులపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నర్సింగాపూర్‌లో నివాసం ఉంటున్న నస్పూరి బాపు, రాపల్లిలో నివాసం ఉంటున్న అతని సోదరుడు సతీశ్ ఓ భూమికి సంబంధించి వాగ్వాదానికి దిగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పరస్పరం జరుపుకున్న దాడిలో ఇరువురు సోదరులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన సోదరులపై గురువారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ముల్కల్లకు చెందిన సామంతుల శ్రీను, భూమయ్య భూమికి సంబంధించి గొడవ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురు సోదరులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా నీలకంఠేశ్వర్‌రావు



నియామకపత్రం అందుకుంటున్న నీలకంఠేశ్వర్‌రావు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆల్‌ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ఇన్‌చార్జి సంగ్రాం తవాడే చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల తదితరులు పాల్గొన్నారు.

మూడు జిల్లాల ముచ్చట.. ఖానాపూర్

- ఇక్కడ గెలిస్తే.. మూడు జిల్లాల్లో ప్రొటోకాల్
- గెలుపోటములను నిర్ణయించేది ఆదిలాబాద్ జిల్లా ఓటర్లే
- ఎన్నికల నిర్వహణ బాధ్యతల్లో ఆయా జిల్లాల అధికారులు

జంగ్ తెలంగాణ



కైలాస్‌నగర్/జన్నారం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఖానాపూర్ నియోజకవర్గం ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మూడు జిల్లాలతో పరిధి కలిగి ఉండడం రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలంటే మూడు జిల్లాల్లోని ఓటర్లు ఓటు వేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సైతం ఆయా జిల్లాల అధికారులు పర్యవేక్షించాల్సి రావడం ఆసక్తి రేపుతోంది. ఇక్కడి నుంచి గెలిచిన ఎమ్మెల్యేకు మూడు జిల్లాల్లోనూ అధికారిక ప్రొటోకాల్ అమలు చేయనుండడం ప్రత్యేకతను చాటుకుంటోంది.

పునర్విభజనతో మారిన స్వరూపం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకటైన ఖానాపూర్(ఎస్టీ) నియోజకవర్గ స్వరూపం 2016 అక్టోబర్‌లో చేపట్టిన జిల్లాల పునర్విభజనతో మారిపోయింది. సాధారణంగా ఏదైనా ఒక నియోజకవర్గం ఒకటి, లేదా రెండు జిల్లాల పరిధిలో ఉంటుంది. కానీ ఆరు మండలాలతో కూడిన ఖానాపూర్ నియోజకవర్గం మూడు జిల్లాలతో ముడిపడి ఉంది. నియోజకవర్గ పరిధిలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలు ఆదిలాబాద్ జిల్లాలో, కడెం, దస్తురాబాద్, ఖానాపూర్ మండలాలు నిర్మల్ జిల్లాలో, ఇక మరో మండలం జన్నారం మంచిర్యాల జిల్లాలో ఉన్నాయి. ఇలా మూడు జిల్లాల పరిధిలోకి మారిపోయింది. ఇక్కడి నుంచి పోటీ చేసే అభ్యర్థుల గెలుపోటములను ఆయా జిల్లాల ఓటర్లు నిర్ణయించనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల ఓటర్లే గెలుపోటములను ప్రభావితం చేయనున్నారు. పోటీలో ఉండే అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఈ రెండు మండలాలపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వీరిని ఆకట్టుకుంటే గెలుపు ఖాయమనే దిశగా సాగుతున్నారు.

రెండు జిల్లాల పరిధిలో ఆసిఫాబాద్

మరో నియోజకవర్గమైన ఆసిఫాబాద్ పరిధి కూడా జిల్లాల పునర్విభజనతో రెండు జిల్లాలోకి మారింది. ఈ నియోజకవర్గ పరిధిలో పది మండలాలు ఉండగా కెరమెరి, వాంకిడి, జైనూర్, తిర్యాణి, రెబ్బెన, ఆసిఫాబాద్, సిర్పూర్, లింగాపూర్ మండలాలు ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్నాయి. గాదిగూడ, నార్నూర్ మండలాలు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నాయి. ఇక్కడి నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేకు ఆయా రెండు జిల్లాల పరిధిలో ప్రొటోకాల్ లభించనుండగా, రెండు జిల్లాల అధికారులు ఎన్నికల నిర్వహణ విధులను పర్యవేక్షించనున్నారు.

ఎన్నికల విధుల్లో అధికారులు

ఖానాపూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి కూడా తన పరిధిలోని మూడు జిల్లాల్లోని మండలాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆయా మండలాల అధికారులతో రిటర్నింగ్ అధికారి సమన్వయం చేసుకోవాల్సి వస్తోంది. పోలింగ్ బూత్‌లు, పోలింగ్ ప్రాంతాలు, ఓటర్లు, సమస్యాత్మక ప్రాంతాలు, ఎన్నికల కోడ్, ఉద్యోగులు, ఈవీఎంల వివరాలను ఆయా జిల్లాల అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తోంది. నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, ప్రత్యేక బృందాలు కూడా ఆయా జిల్లాల అధికారులకు తమ పరిధిలోని సమాచారం ఎప్పటికప్పుడు అందించాల్సి వస్తోంది. ఇక సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులైన తహసీల్దార్లు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే సమీక్షలకు హాజరు కావాల్సి రావడంతోపాటు ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తున్నారు. ఇలా ఎన్నికల అధికారులు సైతం మూడు జిల్లాల ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో పని చేస్తున్నారు.

మూడు జిల్లాల్లో ప్రొటోకాల్

ఖానాపూర్ ఎమ్మెల్యేకు నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలో ప్రొటోకాల్ అమలు చేస్తారు. ఆయా జిల్లాల్లో జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు వీరికి ఆహ్వానం అందించాల్సి ఉంటుంది. అభివృద్ధి కార్యక్రమాలు, సమీక్షలు, సమావేశాలు నిర్వహించినా అధికారికంగా సమాచారం అందించాల్సి ఉంటుంది.

ఎ'లక్షణం'గా సాగేందుకు...

- బూత్ లెవెల్ నుంచి జిల్లాస్థాయి వరకు..
- వివిధ స్థాయిల్లో ఎన్నికల అధికారులు
- సజావుగా ప్రక్రియ పూర్తయ్యేందుకు కసరత్తు



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రధానమైనది. తన ఓటు హక్కుతో పౌరుడు నచ్చిన నేతను ప్రజాప్రతినిధిగా ఎన్నుకుంటాడు. ఈ క్రమంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధంగా భావించవచ్చు. జిల్లా ఎన్నికల అధికారి నుంచి మొదలుకుని గ్రామస్థాయిలో గల పోలింగ్ కేంద్రం బూత్ లెవల్ అధికారి (బీఎల్వో) వరకు సమన్వయంతో విధులు నిర్వహిస్తేనే ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తవుతుంది. ఎక్కడ ఏ చిన్న లోపం ఏర్పడినా ఎన్నికల వ్యవస్థకు ఆటంకం కలుగుతుంది. బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్ పత్రాల దాఖలు మొదలుకుని ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. తాజాగా శాసనసభ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాస్థాయి అధికారులు వారి పైఅధికారులు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాస్థాయి ఎన్నికల అధికారి (కలెక్టర్) నుంచి బూత్ లెవెల్ అధికారి (బీఎల్వో) వరకు వివిధ స్థాయిలోని ఎన్నికల అధికారుల గురించి...

జిల్లా ఎన్నికల అధికారి

జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. మిగతా ఎన్నికల నిర్వహణ అధికారులు వీరి ఆధ్వర్యంలో సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కిందిస్థాయి అధికారులకు విధులు కేటాయిస్తూ నిరంతరం సమీక్షలు జరుపుతారు. అధికారులు అందరికీ దిశా నిర్దేశం చేస్తారు. జిల్లాస్థాయిలో కావాల్సిన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వాటిని పర్యవేక్షిస్తారు. ఓటరు జాబితా రూపకల్పన మొదలు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి పూర్తయ్యే వరకు జిల్లా ఎన్నికల అధికారిదే పూర్తి బాధ్యత.

రిటర్నింగ్ అధికారి

రిటర్నింగ్ అధికారులుగా నియోజకవర్గానికి ఒకరు ఉంటారు. వీరిని ఆయా నియోజకవర్గానికి సంబంధించిన శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమిస్తుంది. తమ పరిధిలోని ఎన్నికల ప్రక్రియను వీరు పర్యవేక్షిస్తారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి, వసతుల కల్పన, తదితర అంశాలు వీరి పరిధిలో ఉంటాయి.

సెక్టోరియల్ అధికారి

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడానికి సెక్టోరియల్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల పర్యవేక్షణ బాధ్యతలు వీరు చూస్తారు. ఒక్కొక్కరి పరిధిలో దాదాపు 6 నుంచి 9 పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. వాటిలో ర్యాంపుల ఏర్పాటు, తాగునీటి వసతి, ఫర్నీచర్, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ జరిగేలా చూస్తారు. తమ పరిధిలో జరిగే అంశాలకు వీరే బాధ్యత వహిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో జరిగే అన్నింటికీ వీరిదే సంపూర్ణ బాధ్యత. ఓటింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతర సామగ్రి తీసుకొస్తారు. పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రిని తిరిగి నియోజకవర్గస్థాయి స్ట్రాంగ్ రూమ్‌కు చేరుస్తారు. వీరికి సహాయకంగా అదనపు ప్రొసీడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే కార్యకలాపాలన్నీ వీరి పర్యవేక్షణలోనే ఉంటాయి. ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళికి అనుగుణంగా వీరు పనిచేస్తారు. వీరితోపాటు మరో ఇద్దరు పోలింగ్ అధికారులు పనిచేస్తారు. పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంల పనితీరు, ఇతర కార్యకలాపాలకు వీరిదే బాధ్యత.

ఓటు నమోదు అధికారులు

బూత్ స్థాయి అధికారులు అందించిన సమాచారంతో ఓటరు జాబితాను తయారు చేయడం వీరి ప్రధాన బాధ్యత. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు, జాబితాలో పేర్లు సరిచేసుకునేవారు ఈ అధికారిని సంప్రదించాల్సి ఉంటుంది. తుది ఓటరు జాబితా రూపకల్పనలో వీరిదే ప్రధాన పాత్ర.

బూత్ లెవెల్ అధికారులు

ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో గ్రామస్థాయిలో పనిచేసే వారే బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వోలు). గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన యువత, ఓటు హక్కుకు అర్హులైన వారిని ఓటు నమోదు చేసుకునేలా వీరు అవగాహన కల్పిస్తారు. కావాల్సిన దరఖాస్తులు వీరి వద్ద ఉంటాయి. పూర్తి చేసిన దరఖాస్తులను స్వీకరించి నమోదు చేసిన అనంతరం తుది జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించి పై అధికారులకు సహకరించడం వీరి ప్రధాన బాధ్యత.

ఎడమచేతి చూపుడు వేలిపై సిరా

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల్లో అక్రమాలను నిరోధించేందుకు, దొంగ ఓట్ల నమోదును నివారించేందుకు ఎన్నికల సంఘం సిరాను వినియోగిస్తుంది. పోలింగ్ బూత్‌లో ఓటర్ల ఎడమచేతి చూపుడు వేలిపై సిరా రాస్తారు. చర్మంపై పూసిన ఈ సిరాను త్వరగా తొలగించడం సాధ్యపడదు. వేలిపై పూసిన సిరా కాంతి పడిన 15 నుంచి 30 సెకన్లలో పొడి బారుతుంది. కొంతకాలం వరకు వేలికి సిరా ఉంటుంది. ఎన్నికలకు వినియోగించే సిరా 10 శాతం, 14 నుంచి 18 శాతం సిల్వర్ నైట్రేట్ ద్రావణం మిళితమై ఉంటుంది. సిరాలోని సిల్వర్ నైట్రేటీతో సూర్యరశ్మి తగలగానే చర్మంపై స్పష్టమైన గుర్తు ఏర్పడుతుంది. కర్ణాటక ప్రభుత్వ రంగంలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్, హైదరాబాద్‌లోని ఓ ప్రయోగశాలలో ఈ సిరాను తయారు చేస్తున్నారు. భారత ఎన్నికల సంఘం వద్ద ఈ సిరా ఉత్పత్తికి 1962లోనే ఆయా సంస్థలు హక్కులు పొందాయి. 1976 నుంచి మరో 28 దేశాలకు ఈ సంస్థ సిరాను సరఫరా చేస్తోంది. ఒకరు ఓటు వేశాకా మళ్లీ పోలింగ్ బూత్‌కు వచ్చే పరిస్థితి ఉండదు. ఒకవేళ ఓటు వేయడానికి వచ్చినా అక్కడి సిబ్బంది వారి వేలిని చూసి గుర్తు పట్టేస్తారు.

తిరుగు ప్రయాణ పాట్లు..!

- ప్రయాణికుల ఇబ్బందులు
- అదనంగా బస్సుల రాకపోకలు



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: దసరా పండుగ, సెలవులు ముగియడంతో ప్రయాణికులు తిరుగు ప్రయాణం అవుతున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని బస్‌స్టేషన్ గురువారం ప్రయాణికులతో రద్దీగా మారింది. ఉద్యోగరీత్యా, చదువుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న వారంతా పండుగలకు స్వగ్రామాలకు చేరుకున్నారు. గురువారం నుంచి పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభం, సెలవులు ముగియడంతో తిరుగు ముఖం పట్టారు. మంచిర్యాల బస్‌స్టేషన్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. రద్దీని గుర్తించిన ఆర్టీసీ యాజమాన్యం అదనపు బస్సులు నడపాల్సి వచ్చింది. సాధారణ రోజుల్లో రోజుకు 32 బస్సులు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తాయి. దసరా పండుగకు ఈ నెల 13 నుంచి 23 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 443 ప్రత్యేక బస్సులు నడిపింది. మంచిర్యాల బస్‌స్టేషన్ నుంచి 95 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలను చేర్చింది. ఈ నెల 24న రద్దీ మరింత పెరగడాన్ని గమనించిన అధికారులు అదనపు బస్సులను హైదరాబాద్‌కు నడిపించారు. ఈ నెల 24న 12, 25న 10, గురువారం మరో తొమ్మిది అదనపు బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసింది. రాత్రి సమయంలో రద్దీ ఇలాగే కొనసాగితే మరిన్ని బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. కొందరు ముందస్తు టికెట్ రిజర్వేషన్లు చేసుకోగా, ఇంకొందరు బస్సులో సీటు కోసం పాట్లు పడాల్సి వచ్చింది. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో రూట్లవారీగా ప్రయాణికులకు అనుగుణంగా ఇబ్బందులు లేకుండా బస్సులు రాకపోకలు సాగిస్తాయని డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమానికి పటిష్ట చర్యలు



ఓసీపీని సందర్శిస్తున్న రక్షణ తనిఖీ బృందం

రెబ్బెన(ఆసిఫాబాద్): సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం, రక్షణకు సింగరేణి పటిష్ట చర్యలు తీసుకుంటోందని రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ జీఎం(హెచ్‌ఆర్డీ) బీహెచ్ఎం వెంకటేశ్వర్‌రావు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో గురువారం 54వ రక్షణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసీపీలో చేపడుతున్న రక్షణ పద్ధతులు, చర్యలను ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల్లో ఉద్యోగుల రక్షణకే యాజమాన్యం మొదటి ప్రాధాన్యత ఇస్తూ రక్షణ విషయంలో పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. గతంలో చోటు చేసుకున్న గని ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించుకుంటూ భవిష్యత్‌లో అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రక్షణ పద్ధతులు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, పీవో సత్యనారాయణ, రక్షణ తనిఖీ బృందం సభ్యులు రమేశ్, భాస్కర్‌రావు, రామ్మోహన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం ఓపెన్ కాస్ట్ గనిపై 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్షణ పతాకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంపెనీ రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి సంపత్, ఇంజినీర్ సారంగపాణి, ఎన్విరాన్మెంట్ ఇన్‌చార్జి జలాలుద్దీన్, సంక్షేమాధికారి బొంగూని శంకర్ పాల్గొన్నారు.

ఎస్సార్పీ 3, 3ఏ గనిలో..

ఎస్సార్పీ 3, 3ఏ గనిలో ఏజెంట్ గోపాల్ సింగ్ పతకాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమంలో గని మేనేజర్ సంతోష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో మెరిసిన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: సికింద్రాబాద్‌లోని ఈస్ట్‌మారేడ్‌పల్లి రైల్వే ఇండోర్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి నిర్వహించిన పీఎన్‌బీ మెట్‌లైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ (జేబీసీ) పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. అండర్ 17 బాలుర సింగిల్స్ విభాగంలో శ్రీఆదిత్య హర్షవర్ధన్, బాలికల విభాగంలో అనుమల శ్రీవల్లి విజేతలుగా నిలువగా, అండర్ 11 బాలికల సింగిల్స్‌లో కందికట్ల సహస్ర రన్నర్‌గా నిలిచింది. విజేతలకు రూ.15 వేల నగదు, బ్యాడ్మింటన్ రాకెట్, మెడల్స్, రన్నర్‌గా నిలిచిన వారికి రూ.10 వేల నగదు, రాకెట్, మెడల్స్ అందించినట్లు ఆయన పేర్కొన్నారు. విజేతలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్, చీఫ్ అడ్వైజర్, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్ గురువారం ప్రత్యేకంగా అభినందించారు.



కందికట్ల సహస్ర



అనుమల శ్రీవల్లి



హర్షవర్ధన్

ఇందారం ఓసీపీని సందర్శించిన జీఎం



పరిశీలిస్తున్న జీఎం సూర్యనారాయణరాజు

జైపూర్(చెన్నూర్): మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిని గురువారం జీఎం ఈఅండ్ఎం సూర్యనారాయణరాజు సందర్శించారు. వ్యూపాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఆయన వెంట ఐకేటీసీపీ అధికారి శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ రవికుమార్, అధికారులు బ్రహ్మాజీరావు, తదితరులు ఉన్నారు.

14, 15 తేదీల్లో కంపెనీ స్థాయి లాన్‌టెన్నిస్ పోటీలు



అధికారులకు సూచనలిస్తున్న జీఎం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో నవంబర్ 14, 15 తేదీల్లో కంపెనీస్థాయి లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. గురువారం జీఎం మనోహర్ క్లబ్‌ను సందర్శించి లాన్ టెన్నిస్ కోర్టును పరిశీలించారు. పోటీలకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏరియా పర్సనల్ ఆఫీసర్ సల్ల శ్యాంసుందర్, డీజీఎం (సివిల్) శ్రీనివాస్, డీవైఎస్ఈ జయప్రకాష్, ఏరియా అధికారులు ఉన్నారు.

గుడుంబా స్వాధీనం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్లపూర్‌లో గంపాల పోచమ్మ అనే మహిళ ఇంట్లో గురువారం ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా ఐదు లీటర్ల గుడుంబా లభ్యం కావడంతో పోచమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.3.5 లక్షల నగదు పట్టివేత



కారును తనిఖీ చేస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: పట్టణంలోని కాంటా చౌరస్తాలో గురువారం చేపట్టిన తనిఖీల్లో రూ.3.5 లక్షల నగదు పట్టుబడినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. సాయుధ సీఆర్‌పీఎఫ్ పోలీసులతో వాహనాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్‌లోని బేగంబజార్‌కు చెందిన ఆశీష్‌కుమార్ కారులో డబ్బుల సంచి కనిపించింది. తెరిచిచూడగా అందులో రూ.3.5 లక్షల నగదు లభించింది. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించక పోవడంతో జప్తు చేసి ఎన్నికల ఎఫ్ఎస్‌టీ అధికారులకు అప్పగించగా సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

వృత్తి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళల కోసం ఉచితంగా అందజేస్తున్న వృత్తి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని జీఎం బీ.సంజీవరెడ్డి తెలిపారు. గురువారం ప్రగతి మైదానంలోని సీఈఆర్‌క్లబ్‌లో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగ్ తయారీ ఫ్యాషన్ డిజైనింగ్ వంటి వృత్తి శిక్షణ కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. తమలోని ప్రతిభను వెలికితీస్తే మరింత గుర్తింపు వచ్చి ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, కొట్టే జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.